# మరో గాంధీ

'తీతు', అన్నాడు కోటయ్య మంత్రిగారి సుపుత్రుడు గాంధీ, వచ్చీరాని ముద్దు మాటలు మాట్లాడుతూ – మూడేళ్ళ వయసులో.

'ఏంట్రా!' అనడిగారు కోటయ్య గారు నవ్వుతూ.

'తీతు' అన్నాడు సుపుత్రుడు మళ్ళీ.

సుపుత్రుడు బొద్దుగా, నున్నగా, గున్న ఏనుగులా ముద్దొస్తున్నాడు. వాడి మాటలు మరీ ముద్దుగా ఉన్నాయి కోటయ్యగారికి.

'ఒరే బామ్మర్దీ! ఏంటంటాడీడు?' అని బామ్మర్ది పిచ్చయ్య నడిగారు.

'ఏంట్రా అల్లుడూ?', అడిగాడు మామ.

'తీతు' అన్నాడు అల్లుడు, మావకేసి తిరిగి.

బామ్మర్దిగారికీ అర్థంకాలేదు కాని అల్లుణ్ణి ఎత్తుకుని, 'బుజ్జి..... గుజ్జి..... అబ్బుచ్చిక్కం..... అబ్బుచ్చిక్కం.....' అంటూ ముద్దాడాడు ఓ పదినిమిషాలు.

✧ ✧ ✧

'దోతు', అన్నాడు సుపుత్రుడు ఐదేళ్ళు నిండుతుండగా.

'ఏంట్రా?' అన్నారు కోటయ్య మంత్రిగారు, దిగులుగా. రెండేళ్ళ తర్వాత సుపుత్రుడు పలికిన రెండోమాట అది.

'దోతు', అన్నాడు సుపుత్రుడు మళ్ళీ.

'ఏంట్రా బామ్మర్దీ! ఈడిలా మాట్లాడతన్నాడు?' అన్నారు కోటయ్యగారు వర్రీ అవుతూ. మేనమామ పోలికలు రాలేదు కదా అని బెంగపట్టుకుంది ఆయనకు.

'ఈ ఎదవలా ఆడుకూడా మెంటలైపోడు కదా! ఈడి పోలికే వొచ్చినట్టుంది' అన్నారు సతీమణితో.

'ఆడికేం తక్కువ?' అంటూ గంయిమని లేచింది సతీమణి. తమ్ముడి మీద ఈగ వాలనివ్వదు ఆవిడ.

'ఏం తక్కువ? సదువూసంద్యా అంటలేదు గాని ఎవడిచేతో ఒకడిచేత తన్నులు తిని, ఏడాదికార్నెల్లు ఆసుపత్రిలో బబ్బుంటాడు, కుంబకర్నుడిలా' అన్నారు ఈసడింపుగా.

'కుంబకర్నుడు ఏడాదికార్నెల్లు ఆసుపత్రిలో ఉండేవోడని బారతంలో ఎక్కడా రాసిలేదు. తెలియనోడివి తెలియనట్టుండక ఆడ్ని సీటికి మాటికి అలా దెప్పకు' అని వార్నింగిచ్చింది సతీమణి.

'ఆడెలా పోతే నాకెందుగ్గాని ఈడి సంగతే బయంగా ఉంది' అన్నారు కోటయ్య గారు, మళ్ళీ అసలు సమస్యలోకి దిగుతూ.

సుపుత్రుడు అత్త, తాత అనలేదు. అమ్మ, నాన్న అనడం లేదు. మూడేళ్ళ వయసునుంచి 'తీతు', ఇప్పుడు 'దోతు' తప్ప మరేం మాట్లాడడంలేదు. మైసూరులో స్పీచ్ ఇన్‌స్టిట్యూట్ ఉందంటే నిపుణులచేత పరీక్షలన్నీ చేయించారు కాని వాళ్ళకు ఏ లోపం కనిపించలేదు. 'మాటలు ఓపిగ్గా నేర్పండి' అన్నారు, అంతే. పోనీ ఫారెను తీసుకెడదామా అనుకున్నారు కాని సతీమణి, బామ్మర్ది 'ఫారెను మనకు అచ్చిరాదు' అనేశారు.

మరో రెండేళ్ళు పోయాక ఏడో పుట్టిన రోజున పార్టీకి వచ్చిన పెద్దలతో రాజకీయాలు చర్చిస్తున్న కోటయ్యమంత్రిగార్ని చూస్తూ, 'తుత్తి' అని ముచ్చటగా మూడోమాట పలికాడు గాంధీ.

కోటయ్యమంత్రిగారు ఉలిక్కిపడి సర్దుకుంటుండగా, 'ఏంట్రా అల్లుడూ' అని బామ్మర్ది అల్లుణ్ణి అడిగాడు.

'తుత్తి', అన్నాడు బాలగాంధీ మళ్ళీ.

'సుత్తా?' – బావగారి కేసి తిరిగి, 'బావోయ్! ఈడు నిన్ను సుత్తంటన్నాడు, ఇన్నావా?' అని ఓ పొలికేక పెట్టాడు బామ్మర్ది.

'నీ తలకాయ' అని నిశ్శబ్దంగా పళ్ళు నూరి, 'సూశారా మావోడు– ఇరన్య కసిపుడికి ప్రెహ్లోదుడిలా – నన్నే సుత్తంటన్నాడు' అని పార్టీ పెద్దలతో అన్నారు కోటయ్య మంత్రిగారు, నవ్వడానికి ప్రయత్నిస్తూ.

'మిమ్మల్నేనా అంటుంట' అని వాళ్ళు తేరుకుని, తేలికపడ్డ హృదయాలతో మళ్ళీ చర్చల్లో మునిగిపోయారు.

పుట్టినరోజు పార్టీకి వచ్చిన అతిథులంతా వెళ్ళిపోయాక, ఇంక కోటయ్యగారి కుటుంబం, నీడలా మంత్రిగారి వెంట నిరంతరం ఉండే ఆయన ప్రైవేటు సెక్రటరీ గారూ, కోటయ్య మంత్రిగారికి అప్పుడు, రాజకీయాల్లో గురువు అయిన కురువృద్ధులు అప్పాజీ మాత్రం మిగిలిపోయారు. వినాయకుడిలా బర్తుడే కేకుముందు కూర్చుని ఉన్న సుపుత్రుణ్ణి పరిశీలనగా చూస్తూ, పండిన గడ్డం నిమరసాగారు అప్పాజీ.

అప్పాజీ, గాంధీ గారితో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, నెహ్రూగారితో క్విట్టిండియా ఉద్యమంలో జెయిలుకెళ్ళారు. నెహ్రూగారి కుటుంబం తర్వాత, దేశంలో అంత త్యాగాలు చేసింది ఆయన కుటుంబమేనని ఆయన, ఆయనతోపాటు మరికొంతమంది కూడా అంటుంటారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, ఆయన ఓ అరడజను ఫ్యాక్టరీలు, ఓ డజను మేడలు కట్టుకుని దేశాన్ని సోషలిజం వైపుకు నడిపించడంలో తోడ్పడ్డారు. ఓ కొడుకు గవర్నరుగా, ఓ అల్లుడు మంత్రిగా ఆయన వేసిన బాటల్లో నడుస్తూ దేశ సేవ చేస్తున్నారు.

'నాకూ దేస్సేవ చెయ్యగల ఓపికుంది' అని ఆయన నిలబడ్డా, ఆయన నియోజక వర్గం ప్రజలు 'తవరింక విశ్రాంతి తీసుకోండి' అని మూడుసార్లు బలవంతంగా కూర్చోబెట్టేసరికి రాజకీయాల నుంచి రిటైరవక తప్పలేదు.

'ఈడి గురించి నాకు బెంగగా వుంది' అన్నారు కోటయ్య మంత్రిగారు, అప్పాజీ దగ్గరకు చేరి. ఎవరితో ఒకరితో మనసు విప్పి బాధ చెప్పుకోవాలనుంది ఆయనకు.

'ఆడికేం? ఇనపగుండులా ఉన్నాడు. బెంగెందుకు? సంతోషించక' అన్నారు అప్పాజీ, లాల్చీలోంచి లంకపొగాకు చుట్టతీసి, నోట్లో పెట్టి వెలిగించి, రైలింజనులా గుప్పుతూ.

'ఆడికి సదువంటడం లేదు. ఏడేళ్ళు నిండాయిగాని ఓనమాలు రావు'

'ఆడు ఊళ్ళేలడానికి పుట్టినోడుగాని ఓనమాలు రాసి ఉజ్జోగం సెయ్యాలా? బంగారంలాంటి కుర్రాణ్ణి సదువు పేర్జెప్పి పాడు సెయ్యకు. ఆడు సదూకోడం దేనికి? మావోడు సిన్నప్పుడు మూడెక్కువరా? ఏడెక్కువరా? అనడిగితే 'మూడు' అనేవోడు. ఆడికి లెక్కలు జెప్పే మేష్టరు, ఓ రోజు పిచ్చెక్కి మేడమీది కిటికీలోంచి దూకేసి కాళ్ళూ చేతులూ ఇరగ్గొట్టుకున్నాడు పాపం. ఆదేవయ్యాడు? మేష్టరి గురించి కాదు, మావోడి గురించి అంటన్నా, ఆడేవైనా పాడైపోయాడా? ఇప్పుడు గవర్నరై గవర్నమెంట్ల నాడించడం లే?

'సదూకున్నోళ్ళు - ఐఏయస్సులూ, ఐపీయస్సులూ - ఎయ్యిమంది యస్సు యస్సంటూ ఆడి సెప్పుకిందుంటారుగాని ముందు సీటెలా ఎక్కాలో నేర్పు' అని సలహా ఇచ్చారు అప్పాజీ.

'ఏలాకోలవాడుతున్నారు! సీటెక్కడానికి ఆడికర్హతేదీ' అన్నారు కోటయ్య మంత్రి గారు మాడెష్టుగా.

'అదేంటి ఆర్డినరీ ఓటర్లా మాట్టాడతన్నావు? నీ కొడుకవడవే ఆడి అర్హత. ఇంక ఏరే అర్హతేంటి? మన ఫేమిలీలు దేస్సేవకే కంకణం కట్టుకున్నాయి గదా' అని కోటయ్య మంత్రిగార్ని మెత్తగా మందలించి, ఖద్దరు లాల్చీ చెయ్యి పైకి లాగి, ముంజేతి కంకణాలు గణగణలాడించి, 'ఏలాకోలం కాదు సికాకోలం కాదు. ఆడి 'మంత్రిసం' సూడు. తస్సాదియ్యా! ఇంతమంది గెష్టులున్నా, ఇందాకట్నుంచీ ఆడి తిండిగొడవ ఆడిదే కాని లోకాన్నసలు పట్టించుకుంటన్నాడా?' అన్నారు ఏక దీక్షగా చాక్లెట్లబార్లు పరపర నవిలేస్తున్న సుపుత్రుణ్ణి చూస్తూ.

'దిష్టి తగులుద్ది' అంది కోటయ్య గారి సతీమణి.

'ఈ మాత్రం దానికే దిస్టవుతే రేపు పెద్దయ్యాక ఆడికెంత అపోజిషను దిష్టి తగలాల? దిష్టీలేదు, గిష్టీలేదు' అని ఆరిపోతున్న చుట్టను మళ్ళీ రైలింజనులా గుప్పు గుప్పుమనిపించి, కోటయ్యగారి కేసి తిరిగి, 'ఆడిమాటలిన్నావా?' అనడిగారు.

'అయిదేళ్ళ బట్టీ ఇంటన్నానుగాని అర్థమై సావడం లేదు' అని కోటయ్య మంత్రి గారు తలకొట్టుకున్నారు. అప్పాజీ పగలబడి నవ్వారు.

'పులి కడుపున పులే పుడతదిగాని మేకెల్లా పుడతది? 'ఓటు', 'సీటు', 'కుర్చీ' అనేవోడికి ఓనమాలు నేర్పితే ఎల్లా? నా మాటిని, ఆడ్ని సుబ్రంగా వేలీస్కూలో పడేయ్. సదువొద్దని మళ్ళీ స్కూలంటాడేంటి అని ఆశ్చర్యపోకు. మా మనవలు కూడా అక్కడే సదూతున్నారులే.

'బ్లఫ్ మాస్టరు బద్దర్రావు తెలుసు కదా! నేనట్టుకున్న కుందేలుకి మూడేకాళ్ళనే వోళ్ళు దేసెంలో సాలామందుండొచ్చు. కాని కుక్కనట్టుకుని మూడు కాళ్ళ కుందేలని దబాయించేవోడు బద్దర్రావు. మనిషి మూడడుగులెత్తే గాని ఆడి ఆశ ఆకాశవెత్తు. ఆడి సూపెప్పుడూ పైనే గాని కిందుండేది గాదు. ఆదు నీకు తెలీపోడవేంటి? నీ కుర్చీకి కూడా ఓసారి ఎసరెట్టినట్టున్నాడు?

'ఏ పార్టీలోకెడితే ఆ పార్టీ నాదే అనేవోడు. తిన్నగా లీడరు పాదాల దగ్గర కూర్చుని ఆడెనక పెద్దగొయ్యి తవ్వేసేవోడు. కుర్చీలో కూర్చున్న ఎర్రిముండావోడికి

పాదాల దగ్గర ఈడే కనిపించేవోడు గాని ఈడు తవ్విన గొయ్యి పడేదాకా కనిపించేది కాదు. గొప్ప టేలంటున్నాడులే.

ఆడి బాద పడలేక, అన్ని పార్టీలవోళ్ళు కూడబలుక్కుని, ఆడికి బరణవిచ్చి రాజకీయాల్నుంచి తప్పించి, తిరపతికొండ మీద ఫేమిలీ వారసులికి స్కూలెట్టి, దానికి ఆణ్ణి ప్రిన్సిపాల్ని చేసేరు – అదన్నమాట వేలీ స్కూలంటే.

ఎనకనుంచి గోతిలో తోసి ముందునుంచి చెయ్యందీడం, దేసేన్ని ముక్కలు చేసి మళ్ళీ అతకడం, పార్టీలెట్టడం, పార్టీలు చీల్చడం, ఫ్లోరు క్రాసింగులు, ఎన్నుపోట్లు – ఒక్కటేంటి, అన్ని ట్రిక్కులు బద్రంగాడు నేర్పుతాడు పిల్లలకి.

ఏదో ఓ రోజు నేనే వేంకటేశ్వరసామినని ఈడొచ్చి నా గుళ్ళో కూసోడు కదా అని పాపం ఆ దేవుడు బెంగెట్టుకునుంటాడుగాని, బద్రంగాడు కొండదిగనంత వరకూ ఏ పార్టీ కొంప ములగదు. పెట్టుబడి – ఆడి ఫీజు– ఎక్కువే అనుకో కాని లాబం కూడా ఎక్కువే కదా!

అంచేత సుబ్రంగా కుర్రాడికి ఆడి అండర్లో ట్రెయినింగిప్పించు. కార్లూ, స్కూటర్లూ హైజాకింగు చేస్తూ, వయసొచ్చేటప్పటికి సోషలిజం, వీకరు సెక్షన్లు, సెక్యూరిటీ, యూనిటీ లాంటి ఇంకో పది మాటలు, ఓ యాభై పాయింట్లు లెక్కెట్టడం నేర్చుకుని దేశాన్ని హైజాకింగు చెయ్యడానికి సిద్ధవైపోతాడు. ఏరా అబ్బిగా?' అన్నారు అప్పాజీ, బాలగాంధీని ఎత్తుకుంటూ.

బాలగాంధీ తాతగారి చంకమీదికెగిరి, ఆయన నెత్తిమీద టోపీ లాగి తన నెత్తిమీద పెట్టుకున్నాడు మెరుపులా. తాతగారు మళ్ళీ పగలబడి నవ్వారు.

'ఇలాంటోడి గురించి దేసెం బెంగెట్టుకోవాలిగాని నువ్వు బెంగెట్టు కుంటావేంటి?'

'ఏరా! మంత్రివవుతావేంట్రా?' అనడిగారు కోటయ్య మంత్రిగారు, సుపుత్రుడిని ముద్దు ముద్దుగా.

'ఉ..... ఊ....' – సుపుత్రుడు అడ్డంగా తలూపాడు – 'వూన్నవుతా'

కోటయ్య మంత్రిగారు తలపట్టుకుని మళ్ళీ సోఫాలో కూలిపోయారు.

'ఇదేంటి అప్పాజీ? ఈడు వూన్నవుతానంటన్నాడు – సదవేస్తే ఉన్న మతిబోయినట్టు' అన్నారు దిగులుగా.

ఈసారి అప్పాజీకీ అర్థంకాలేదు. కోటయ్య మంత్రిగారి కుమార రత్నానికి అలాంటి ఆలోచన రాకూడదని ఆయనకు తెలుసుకాని ఆ మాటకి అర్థం తెలియక

ఆయన మళ్ళీ గెడ్డం నిమరడం మొదలు పెట్టారు. 'ఈడి ఎదవ బుర్రలో ఎన్ని ఎదవ ఆలోచన్లుండడానికి చాన్సుంది?' అని ఆయన కళ్ళు మూసుకుని ఆలోచిస్తుండగా, 'ఓ.....' అని ఓ పొలికేక వెనుకనుంచి వినిపించి అదిరిపడ్డారు.

కోటయ్యమంత్రిగారి పి.యస్. గారు ఇందాకట్నుంచీ మౌనంగా ఉన్నా, ఆయన బుర్ర మాత్రం సూపర్ కంప్యూటర్లా పనిచేస్తోనే ఉంది. సుపుత్రుడి మాటలు, అప్పాజీ వివరణ, అన్నీ ఆయన కంప్యూటర్లోకి ఫీడ్ చేసి 'ప్యూను' అనేది ఏవైె ఉంటుందా అని ఎనలైజు చెయ్యగా అర్థమైపోయి ఆ షాక్కి తట్టుకోలేక 'ఓ..... ఓ......' అని ఓడ కూత పెట్టినట్లు కూతవేశారు.

ఆ ఓంకారానికి కోటయ్య మంత్రిగారు గుండెమీద చెయ్యివేసుకుని, 'అసలే వీక్ గుండె! ఆగి సచ్చేది! ఏంటా అరుపు దుమ్ముల గొండులా' అని పి.యస్. గార్ని కసిరారు.

పి.యస్.గారు షాక్ నుంచి తేరుకుని, ఒగరుస్తూ, 'ప్యూ..... ను..... కా.... దు.... సార్....' అని మాత్రం అనగలిగారు.

'మరేంటి?'

'పి.యం..... ప్రధానమంత్రి..... ఔనా అబ్బాయి గారూ?'

'ఔను. పూన్నవుతా' అన్నాడు బాలగాంధీ మళ్ళీ.

కోటయ్య గారి వీక్ గుండె మళ్ళీ ఒకసారి 'ఆగి సావబోయింది'. క్షణం తర్వాత తేరుకుని 'అమ్మ నా కొడుకో' అని సంతోషం పట్టలేక కొడుకుని ఎగరేసుకుని ఎత్తుకుని ముద్దులాడుతుండగా 'అయ్యో' అని పెద్ద మూలుగు వినిపించింది.

'ఏంటది?' అన్నారు కోటయ్య మంత్రిగారు ఆశ్చర్యపోతూ.

'ఈడు పియం అవుతానంటే దేసెం మూలుగుతోంది. నువ్వదేం పట్టించుకోకు. మావోడు గవర్నరైనప్పుడు ఇలాగే మూలిగింది. ఇశ్వాసం లేని దేసెం మనోడెవడైనా పైకొస్తే ఓర్వలేదు గదా' అన్నారు అప్పాజీ, కొంచెం కోలుకున్న తర్వాత.

*(స్వాతి వారపత్రిక, జులై 21, 1985)*